సాక్షి నిజామాబాద్

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



ఉమ్మడి జిల్లాలకు..

నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో క్యాన్సర్ చికిత్స, వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్లను ప్రారంభిస్తామని మంత్రి రాజనర్సింహ అన్నారు.

- 8లో ▸



మహిళా సంఘాలకు డ్రోన్‌లు

మహిళా సంఘాలకు వ్యవసాయ పనుల్లో వినియోగించే డ్రోన్‌లు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.8 /16.9

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్‌కు చిత్రపరిశ్రమ



నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహంతోనే నాడు మద్రాస్‌లో ఉన్న తెలుగు చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చిందని, మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వంటి వారిది ప్రముఖ పాత్ర అని పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు చిత్రపరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండించారు. అన్నపూర్ణ, పద్మాలయ, రామానాయుడు స్టూడియోల నిర్మాణాలకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్థలాలు ఇచ్చి ప్రోత్సహించిందని గుర్తుచేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవారిని ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ ఘటనలో చట్టం తన పని తాను చేసుకుపోయిందని, ఇందులో ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు లేవని పేర్కొన్నారు.

గుత్ప నీటి విడుదల



నందిపేట్(ఆర్మూర్): రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని యాసంగి పంటల సాగు కోసం గుత్ప నీటిని విడుదల చేస్తున్నట్లు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉమ్మెడ శివారులో ఉన్న గుత్ప మొదటి పంపుహౌజ్ వద్ద స్విచ్ ఆన్‌చేసి మోటార్ల ద్వారా ఆదివారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుత్ప ఎత్తిపోతల పరిధిలోని 34,650 ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. నందిపేట, మాక్లూర్, ఆలూర్, వేల్పూర్, జక్రాన్‌పల్లి మండలాల పరిధిలోని చివరి ఆయకట్టుకు నీరందే వరకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. రైతులు సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలని, నాలుగు విడుతలుగా 545 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్లీడర్‌గా అమిదాల సుదర్శన్



ఖలీల్‌వాడి: డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా అమిదాల సుదర్శన్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీగా ఎర్రం సదానందం నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్, లెజిస్లేటివ్ ఎఫైర్స్ తిరుపతి ఈనెల 18న ఉత్తర్వులు జారీ చేశారు. సుదర్శన్, సదానందం మూడేళ్లపాటు ప్రభుత్వం తరపున సివిల్ కేసులను వాదిస్తారు.

దొంగ లెక్కలు చెప్పొద్దు



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు

- నా వద్ద ఆధారాలతో పూర్తి సమాచారం ఉంది
- 60శాతం మంది వైద్యులు గైర్హాజరవుతున్నారు
- వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తే చర్యలు తప్పవు
- వందరోజుల్లో మళ్లీ వస్తా.. మార్పు రావాల్సిందే
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేయండి
- సమీక్షలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- జీజీహెచ్ సూపరింటెండెంట్ పనితీరుపై ఆగ్రహం

నిజామాబాద్‌నాగారం: పేదలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో వైద్యారోగ్య శాఖ, జీజీహెచ్ అధికారులతో ఆదివారం ఉమ్మడి జిల్లా సమీక్షాసమావేశం నిర్వహించారు. అంతకు ముందు సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పవర్ ప్రెజెంటేషన్ ద్వారా తాము అందించిన సేవలను వివరించారు. సరైన సౌకర్యాలు లేకున్నా శస్త్ర చికిత్సలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంత్రి కల్పించుకుని.. మీరు చెప్పే నంబర్లను నమ్మబోనని, గాంధీ, వరంగల్ ఆస్పత్రులకన్నా ఎక్కువ వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పడం మాను కోవాలని అసహనం వ్యక్తం చేశారు. మీరు ఏం చేస్తున్నారో తెలుసునని, హైదరాబాద్ నుంచి జీజీహెచ్‌కు వచ్చేందుకు వైద్యులు మొగ్గు చూపుతుండడంపై మండిపడ్డారు. ప్రతి రోజూ కేవలం 40శాతం మంది వైద్యులు మాత్రమే విధులకు హాజరవుతున్నారన్నారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ప్రతిమారాజ్‌కు సూచించారు.

> "జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లో ఏం జరుగుతుందో తెలుసు, మీరు నంబర్లను చూపి గొప్పలు చెప్పుకోకండి. నా వద్ద పూర్తి సమాచారం ఉంది. ప్రతి రోజూ 60శాతం మంది వైద్యులు గైర్హాజరవుతున్నారు. వైద్యులు సమయపాలన పాటించాలి. ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తే చర్యలు తప్పవు. వంద రోజుల్లో మళ్లీ వస్తా.. మార్పు రాకుంటే కఠిన చర్యలు తప్పవు".
>
> – వైద్యారోగ్యశాఖ ఉమ్మడి జిల్లా సమీక్షాసమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ

అనంతరం సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. మూడు నెలల్లో జిల్లాలో క్యాన్సర్ చికిత్స కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. జిల్లాని ప్రతి సబ్‌సెంటర్‌లో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రి, జీజీహెచ్‌లో కనీసం 85శాతం వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి పేదలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించే ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ, సదుపాయాల కల్పనపై నిఘా సారించాలన్నారు.

సమాచారం ఇవ్వడం లేదు : ధన్‌పాల్

ఏడాదిలో ఒక్కసారి కూడా ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ(హెచ్‌డీసీ) సమావేశం ఎందుకు ఏర్పాటు చేయలేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. తన నియోజకవర్గం పరిధిలో జీజీహెచ్ ఉన్నప్పటికీ తనకు ఏవిధమైనా సమాచారం ఇవ్వడం లేదని అన్నారు. సూపరింటెండెంట్ ఎమ్మెల్యేలకు కనీస గౌరవం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. హెచ్‌డీసీ ఏర్పాటు చేయాలని సూచించారు.

మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన రాకేశ్‌రెడ్డి

తాను అడగగానే ఆర్మూర్‌కు 108తోపాటు, అంకాపూర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంపై మంత్రి దామోదరకు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. స్టెతస్కోప్ వంటి చిన్నచిన్న సామగ్రి ఉండడం లేదని కొంత మంది వైద్య సిబ్బంది చెప్పారని ఎమ్మెల్యే తెలుపగా.. చిన్నచిన్న అవసరాలకు అవసరమైతే ఎమ్మెల్సీ ఫండ్ ఇస్తామని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, డీఎంహెచ్‌వో రాజశ్రీ, వైద్యారోగ్య, జీజీహెచ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.7కోట్లు మంజూరు చేస్తా

జీజీహెచ్‌లో పైపులైన్‌ల లీకేజీ, భవనంపై పిచ్చి మొక్కలు, కిటికీలకు అద్దాలు పగిలిపోవడం , లిఫ్టులు చెడిపోవడం, ఎలుకలు తిరగడంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. జీజీహెచ్ అధికారుల వినతి మేరకు ఆస్పత్రి అభివృద్ధికి రూ.7 కోట్లు మంజూరు చేస్తామన్నారు. వందరోజుల్లో తాను మళ్లీ వస్తానని గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఏడో అంతస్తు వరకు అంతా శుభ్రంగా ఉండాల్సిందేనని అన్నారు. నెల రోజుల్లో జీజీహెచ్‌లో మార్పు రావాల్సిందేనని స్పష్టం చేశారు.



సమావేశంలో పాల్గొన్న జీజీహెచ్, ఉమ్మడి జిల్లా వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది

మాతాశిశు ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభం



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట నూతనంగా నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం, క్రిటికల్ కేర్ భవనాన్ని రాష్ట్ర వైద్యారోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ప్రారంభించారు. నాలుగు అంతస్తుల భవనాన్ని ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి ప్రారంభించి పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మమహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వసలహాదారు షబ్బీర్అలీ, ఎమ్మెల్యేలు ధన్‌పాల్‌సూర్యనారాయణగుప్తా, డాక్టర్ భూపతిరెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, కలెక్టర్‌రాజీవ్‌గాంధీ, నగర మేయర్ నీతూకిరణ్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ మహిళలకు యూనిఫామ్!

- త్వరలో చీరలు పంపిణీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఏడాదికి రెండు చొప్పున ఇవ్వాలని నిర్ణయం
- జిల్లాలో 2.51లక్షల మంది సభ్యులు



సమావేశమైన ఎస్‌హెచ్‌జీ మహిళలు (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు యూనిఫామ్(చీరలు) ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే చీరల డిజైన్, రంగును ఖరారు చేసిన ప్రభుత్వం వాటిని రాష్ట్ర చేనేత సహకార సంఘం (టెస్కో) ద్వారా తయారు చేయిస్తోంది. లేత నీలం రంగులో ఉన్న చీరకు కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన బార్డర్ ఉండనుంది. వీటిని కొత్త ఏడాదిలో ఎస్‌హెచ్‌జీ మహిళలకు ప్రభుత్వం పంపిణీ చేసే అవకాశముంది. ఒక్కో సభ్యురాలికి ఏడాదికి రెండు చొప్పున చీరలు ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు జిల్లా, మండల సమాఖ్య అధ్యక్షులతోపాటు వీవో అధ్యక్షులకు మాత్రమే ఉన్న డ్రెస్ కోడ్ విధానం ఎస్‌హెచ్‌జీలకు వర్తింపజేయడం ఇదే తొలిసారి. జిల్లాలో 28 మండల సమాఖ్యలు ఉండగా 806 వీవోలు, 23,753 ఎస్‌హెచ్‌జీ సంఘాలు, 2.51లక్షల మంది సభ్యులున్నారు. ఒక్కో గ్రూపు పరిధిలో 8నుంచి 15మంది సభ్యుల వరకు ఉంటారు. వీరు పొదుపును చేసుకుంటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను పొందుతున్నారు. తీసుకున్న రుణాలను ఇంటి అవసరాలు, వ్యాపారాలకు ఉపయోగించి స్వయం ఉపాధిని పొందుతున్నారు. జిల్లాలో కొన్ని ఎస్‌హెచ్‌జీలు ధాన్యం కొనుగోలు సైతం చేస్తున్నాయి. ప్రభుత్వ కార్యాక్రమాల్లోనూ పాలు పంచుకుంటున్నాయి. ఇలాంటి మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యేక గుర్తింపు ఉండేలా ప్రభుత్వం యూనిఫామ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. నెలకోసారి గ్రామాల్లో నిర్వహించుకునే సమావేశాలకు మహిళలు యూనిఫామ్‌తోనే రావాలని నిబంధన పెట్టనుంది.

వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం



మహిళా సంఘాల సభ్యులకు డ్రెస్ కోడ్ చీరలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని త్వరలోనే పంపిణీ చేసే అవకాశముంది. జిల్లాకు వచ్చిన వెంటనే మండలాలకు చేరుస్తాం. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం వాటిని సభ్యురాలకు అందజేస్తాం. – సాయాగౌడ్, డీఆర్‌డీవో, నిజామాబాద్

నవోదయ స్కూళ్లకు స్థలం కేటాయించండి

సుభాష్‌నగర్: నిజామాబాద్, జగిత్యాల్ జిల్లాలకు ఇటీవల కేంద్ర కేబినెట్ మంజూరు చేసిన నవోదయ విద్యాలయాలకు స్థలం కేటాయించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సీఎంను ఆయన నివాసంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో కలిసి అరివ్వంద్ మర్యాదపూర్వకంగా కలి శారు. నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సుమా రు 20 ఎకరాల చొప్పున భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాల కోరడంతోపాటు రెండు జిల్లాల్లో పలు ప్రతిపాదిత స్థలాలను సీఎంకు వివరించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులను ఎంపీ అర్వింద్ వివరించారు. ఆర్వోబీల నిధులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లించిందని, దీంతో సకాలంలో బిల్లులు అందక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బి ల్లులు మంజూరు చేసి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు. జిల్లాలో ప్రతిపాదిత జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్ట్ పనులకు సంబంధించి ఓఎల్ఎస్ సర్వేని రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసి కేంద్రానికి నివేదించాలని కో రారు. జగిత్యాల పట్టణానికి కేంద్రీయ విద్యాల యం సైతం మంజూరయ్యే దశలో ఉందని, ఏర్పాటుకు స్థలాన్ని అన్వేషించాలని కోరారు. తమ వి జ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ అర్వింద్ కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం రేవంత్‌ను సన్మానిస్తున్న ఎంపీ అర్వింద్

శ్రీ రామాలయం.. మహిళా ప్రాతినిధ్యం

- గత రెండేళ్లుగా సమర్థంగా క్రతువుల నిర్వహణ
- ధనుర్మాస ఉత్సవాల్లో ప్రత్యేకత చాటుకుంటున్న ఆలయం
- 39 ఏళ్లుగా ప్రతి ఏటా వైభవంగా తులసీ కల్యాణం, శ్రీగోదా రంగనాయక కల్యాణం



ఇందూరు సుభాష్‌నగర్ శ్రీరామాలయం



గర్భాలయంలో మూలవిరాట్‌లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆలయ నిర్వహణలో అనేక క్రతువులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతి ఒక్క క్రతువును ఎంతో క్రమపద్ధతితో చేయాలి. గత 39 ఏళ్లుగా ఇందూరు సుభాష్‌నగర్ రామాలయం అత్యంత క్రమశిక్షణతో నిర్వహిస్తున్న కార్యక్రమాల కారణంగా అందరికీ సుపరిచితమైంది. ముఖ్యంగా ధనుర్మాస ఉత్సవాల నిర్వహణలో ఆలయానికి ప్రత్యేకత ఉంది. ఈ ఆలయ నిర్వహణ కోసం ఎప్పటికప్పుడు కమిటీని ఎన్నుకుని ముందుకు వెళ్తున్నారు. గత రెండేళ్లుగా కార్యవర్గంలో కీలకమైన పదవులన్నీ మహిళలే దక్కించుకున్నారు. వీరు ఆలయంలో క్రతువుల నిర్వహణ విషయంలో అత్యంత పకడ్బందీగా వ్యవహరిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఆలయ చైర్‌పర్సన్‌గా హైకోర్టు న్యాయవాది కె సరళామహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ శోభానవీన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి గోదాదేవి, బి ఊర్మిళ, శ్రీదేవి, సంయుక్త కార్యదర్శులుగా ఈగ సబిత, కట్టా రాధారాణి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్ అరుంధతి వ్యవహరిస్తున్నారు. వీరు అత్యంత సమర్థవంతంగా, శాస్త్రోక్తంగా క్రతువులు నిర్వహిస్తుండడంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

■ శ్రీరామాలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్నాయి. బీఆర్ గంగారెడ్డి ఫౌండర్ అధ్యక్షుడిగా 1986 ఏప్రిల్ 14న త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి మంగళశాసనములతో ఆలయం ప్రతిష్ట అయ్యింది. ఇందులో సీతారామలక్ష్మణ స్వాములతోపాటు ఆంజనేయుడు, గరుత్మంతుడు, లక్ష్మీదేవి, గోదాదేవి మూలవిరాట్‌లుగా ఉన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాలు వచ్చే నెల 14 వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం తిరుప్పావై ప్రవచనాలు ఏర్పాటు చేస్తున్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జనవరి 13న గోదా రంగనాయక కల్యాణం, 14న మకర సంక్రాంతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.ప్రతి ఏటా ధనుర్మాస ఉత్సవాలకు ముందు కార్తీక మాసంలో ప్రత్యే కంగా నెల రోజులపాటు బృందావన పూజలు (తులసీపూజలు) చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆలయ ప్రాంగణంలో బృందావనం పేరిట తులసీవనాన్ని పెంచుతున్నారు. బృందావనం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేస్తారు.

శ్రీరామ పట్టాభిషేకం, బతుకమ్మ ఉత్సవాలు



ఆలయంలో ప్రతి నెలా శ్రీరాముడి పునర్వసు కల్యాణం, ప్రతి శ్రీరామ నవమికి 10 రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. రథోత్సవంతోపాటు పట్టాభిషేకం కార్యక్రమాలు ఉంటాయి. దసరా ఉత్సవాలు, పదిరోజులు బతుకమ్మ ఉత్సవాలు చేస్తాం. వైకుంఠ ఏకాదశికి ముక్కోటి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాం. వచ్చేనెల 10న ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయంలో విష్ణు స్వరూపంగా భావించే రావి చెట్టు, లక్ష్మీదేవి స్వరూపంగా భావించే జమ్మి చెట్టు, శివుని స్వరూపంగా భావించే ఉసిరి చెట్టుకు భక్తులు నిత్య పూజలు ఉంటాయి. ఈ నెల 31న నాయిగనాయి ఉత్సవం, వచ్చే జనవరి 2న లక్ష్మీదేవి వైభవ విశేషము, 7న సింహాసనం పాట్టు, 8న దీపోత్సవం , 10న వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం, లక్ష పుష్పార్చన, 11న కూడారై ఉత్సవం, 12న అన్నకూటోత్సవం(కదంబం), 13న ఉలుక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నాం. – కె సరళామహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్‌పర్సన్

అందరి సహకారంతో..



భక్తుల సహకారంతో ఆలయంలో అన్ని సేవలను, క్రతువులను నిర్వహిస్తున్నాం. కార్యవర్గ సభ్యులందరూ సమష్టి బాధ్యతతో క్రమపద్ధతితో వ్యవహరిస్తున్నారు. ఆలయంలో పొంగలి, దద్దోజనం, పులిహోర, సిరా, కుడారై భోగం, కదంబం, ధనుర్మాస రోజువారి పుష్ప కైంకర్యం, ధనుర్మాస ప్రసాదం కోసం దొప్పలు, దీపోత్సవం, ఆహ్వాన పత్రికలు, వస్త్రములు, లక్ష పుష్పార్చన, గోదా కల్యాణం రోజు అన్నదానం తదితరాలకు 42 దాతల కుటుంబాలు నిరంతరం సహకరిస్తున్నాయి. ప్రత్యేకంగా ధనుర్మాస ఉత్సవాలకు కమిటీ ఏర్పాటు చేసుకుని ముందుకు వెళుతున్నాం.
– ఎస్ శోభానవీన్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌లో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దళిత సంఘాల నాయకులు ఆదివారం దహనం చేశారు. భారతజాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దేవతి అనంత్, దాసు, సుశాంత్, వసంత్, అనంతరావు, కిషన్, శాంతయ్య, నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎం సంఘం అసోసియేట్ అధ్యక్షుడిగా లక్ష్మీనర్సయ్య



ఆర్మూర్‌టౌన్‌:పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా లక్ష్మీ నర్సయ్య మాట్లాడుతూ.. హెచ్‌ఎంల సమస్యలు తీర్చడంలో తన కృషిని గుర్తించి ఈ పదవి అందించిన రాష్ట్ర సంఘం అధ్యక్షుడు రాజగంగారెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి గిరిధర్‌గౌడ్‌కు, జిల్లాశాఖ కార్యావర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో సంఘ బలపేతానికి, అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పీఎస్ పరిధిలోని లలితానగర్‌లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో ఆదివారం టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని పట్టుకోగా వారి నుంచి రూ.14,810 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నిమిత్తం ఐదవ టౌన్ పోలీసులకు అప్పగించారు.

గ్రామీణ బ్యాంక్ సేవలకు అంతరాయం

ఇందల్వాయి: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(వరంగల్)ని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో విలీనం చేస్తున్న నేపథ్యంలో ఈ నెల 28 నుంచి జనవరి 1 వరకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలు నిలిపివేయనున్నట్లు గన్నారం, ఎల్లారెడ్డిపల్లె శాఖల మేనేజర్లు ఆదివారం పేర్కొన్నారు. విషయాన్ని ఖాతాదారులు గమనించి సహకరించాలని కోరారు.

మహిళా సంఘాలకు డ్రోన్‌లు!

- నియోజకవర్గానికి ఒకటి చొప్పున అందించడానికి ప్రతిపాదనలు
- మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ



మోర్తాడ్(బాల్కొండ): పంటల సాగులో డ్రోన్‌ల వినియోగం పెరగడంతో మహిళా సంఘాలకు వాటి ద్వారా ఆదాయం పెంచడానికి ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం రూపొందించింది. మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గానికి ఒక డ్రోన్‌ను కొనుగోలు చేసి మహిళా సంఘానికి అప్పగించాలని ప్రతిపాదించారు. ప్రభుత్వ సూచనతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) డ్రోన్‌ల మంజూరు కోసం ప్రతిపాదనలను సిద్ధం చేసింది.

80 శాతం సబ్సిడీ.. 20 శాతం రుణం..

మహిళా సాధికారత లక్ష్యంగా పని చేస్తున్న సెర్ప్ ద్వారా ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నమో డ్రోన్ దీదీ పథకంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తిపథకం కింద డ్రోన్లను అందించడానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. రూ.10లక్షల వ్యయంతో డ్రోన్‌ను కొనుగోలు చేసి వాటి ద్వారా మహిళా సంఘానికి ఆదాయం పెంచాలని యోచిస్తున్నారు. ఒక్కో దానికి 80శాతం సబ్సిడీ, మిగిలిన 20శాతం రుణంగా అందించనున్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున తొలి విడతలో కొనుగోలు చేయడానికి సెర్ప్ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. మహిళా సంఘాలు ఈ డ్రోన్‌లను అద్దెకు ఇవ్వడం లేదా సొంతంగానే ఆపరేట్ చేయించడం వల్ల ఆదాయం పెరిగే అవకాశం ఉంది. మహిళా సంఘాలకు ఆదాయం పెరిగితే సభ్యులు ఆర్థికంగా వృద్ధి చెందుతారని ప్రభుత్వం భావిస్తుంది. పంటలను ఆశించే చీడపీడల నివారణ కోసం రైతులు డ్రోన్‌ల ద్వారా మందులను చల్లిస్తున్నారు. డ్రోన్‌లతో రసాయనాల పిచికారి ఆశించిన ఫలితాలను ఇస్తుండటం గమనార్హం. ఈనేపథ్యంలో డ్రోన్‌లు కొనుగోలు చేసి మహిళా సంఘాలకు అప్పగించడం ఆహ్వానించదగ్గ పరిణామం అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికే డ్రోన్‌ల కొనుగోలు. జిల్లాలో డ్రోన్‌ల కోసం ప్రతిపాదనలు పంపించాం. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి ఒకటి కొనుగోలు చేయనున్నాం. ఒక్కో డ్రోన్‌కు రూ.10లక్షలు, రాయితీ కూడా ఉంటుంది.

– సాయాగౌడ్, పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

కాకాకు ఘన నివాళి

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కలెక్టరేట్‌లో కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత వెంకటస్వామి (కాకా) వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కాకా చిత్రపటానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర మాజీ మంత్రి గడ్డ వెంకటస్వామి బడుగు బలహీనుల కోసం విశేషంగ కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఆయన వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగధర్, నుడా చైర్మన్ కేశవేణు, అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

సీపీ కార్యాలయంలో ..



ఖలీల్‌వాడి: నగరంలోని సీపీ కార్యాలయంలో ఆదివారం కేంద్ర మాజీ మంత్రి దివంగత నాయకుడు కాకా వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కాకా చిత్రపటానికి డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. డీసీపీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుడు కాకా అని కొనియాడారు. ఆయన చేసిన పోరాటాలు అన్ని దశల్లోనూ స్ఫూర్తిని నిలిపాయన్నారు. సీసీఆర్‌బీ సీఐ సతీష్‌కుమార్, ఎస్‌బీ సీఐ ప్రసాద్, రిజర్వ్ సీఐలు సతీష్ కుమార్, తిరుపతి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, అధికారులు

ఉమ్మడి జిల్లాలకు క్యాన్సర్, వాస్క్యులర్ కేంద్రాలు



రెంజల్‌లో మాట్లాడుతున్న మంత్రి

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

రెంజల్(బోధన్): ఉమ్మడి నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాలకు క్యాన్సర్ చికిత్స కేంద్రాలతోపాటు వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్‌లను త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. రెంజల్‌లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా వరకు ప్రభుత్వ ఆస్పత్రుల ద్వార మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా 90 శాతం వరకు ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. అన్ని ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక చికిత్స అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 213 నూతన అంబులెన్స్‌లను ప్రారంభించినట్లు మరో 80 నుంచి 85 వరకు అవసరం ఉన్నట్లు తెలిపారు. త్వరలో వాటిని అందుబాటులోకి తెస్తామన్నారు. 102 అమ్మ ఒడి వాహనాలను ఆయా ప్రాంతాలకు సమకూరుస్తామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ఐవీఎఫ్ సెంటర్లను అందుబాటులోకి తెస్తామన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాయకులు నాగభూషణంరెడ్డి, సాయరెడ్డి, దనుంజయ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ మంత్రికి వినతుల వెల్లువ



మంత్రి దామోదర రాజనర్సింహకు సమస్యలను విన్నవిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు



మంత్రిని కలిసిన రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సభ్యులు

నిజామాబాద్ అర్బన్/నిజామాబాద్ సిటీ/నిజామాబాద్‌నాగారం: జిల్లాకేంద్రంలో ఆదివారం పర్యటించిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ సురేష్, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య ఆధ్వర్యంలో సభ్యులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. అలాగే జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిని వెయ్యి పడకల ఆస్పత్రిగా మార్చాలని సీపీఐ నాయకులు మంత్రిని కోరారు. సమగ్రశిక్ష ఉద్యోగులు తమ సమస్యలను మంత్రికి విన్నవించారు. మంత్రికి పలు సమస్యలను విన్నవించడానికి వచ్చిన ఎంఐఎం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. చివరకు మంత్రికి విన్నవించడానికి అనుమతించారు. ఏఐటీయూసీ, వివిధ సంఘాల ప్రతినిధులు మంత్రికి పలు సమస్యల పరిష్కారానికి విన్నవించారు. డాక్టర్ కవితా రెడ్డి సైతం మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్‌సీడీ క్లినిక్ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ క్లినిక్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. అలాగే ఎంసీహెచ్‌లోని నూతన భవనంలో క్రిటికల్ కేర్ విభాగాన్ని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా ప్రారంభించారు. జీజీహెచ్ ఆవరణలో కొత్తగా 108 అంబులెన్సును పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు.

మంత్రికి ఘన స్వాగతం



జిల్లా పర్యటన కోసం విచ్చేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో నాయకులు స్వాగతం పలికారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీహనుమంతు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సుమన్, జిల్లా కార్యదర్శి శేఖర్, రమణారెడ్డి, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.





ఎన్‌సీడీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి



జీజీహెచ్‌లో అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



ఎంసీహెచ్‌లో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

జీజీహెచ్ అధికారులపై మంత్రి ఆగ్రహం





నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ భవనాన్ని మంత్రి చూసి అసహనం వ్యక్తం చేశారు. భవనంపై పిచ్చిమొక్కలు పెరిగి ఉండడంతోపాటు, కిటికీలు పగిలి అధ్వానంగా ఉంది. దీంతో మంత్రి జీజీహెచ్ భవనం ఇలాగే ఉంటుందా అంటు సూపరింటెండెంట్‌పై సీరియస్ అయ్యారు.

రోగులతో ఆప్యాయంగా మాట్లాడిన మంత్రి



నిజామాబాద్‌నాగారం: జీజీహెచ్ ఆవరణలోకి ప్రవేశించిన మంత్రి దామోదర రాజనర్సింహ ముందుగా ఓపీ బ్లాక్‌ను పరిశీలించారు. అనంతరం సమీక్షకు వెళుతుంటే మంత్రిని రోగులు పిలవడంతో ఆ ప్యాయంగా మాట్లాడారు. ఏమైందమ్మ చెప్పు అంటు సమస్యను విని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఆరోగ్య శ్రీ సేవల నిమిత్తం ఉన్న ఆరోగ్య మిత్రతో కాసేపు మాట్లాడారు. అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి నరసింహారెడ్డి తెలిపారు.నిజామాబాద్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా అర్చరీ ట్రైనింగ్ సెంటర్ రాజారం స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ కొల్లూరులో డిసెంబర్ 25న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఖేలో ఇండియా అర్చరీ కోచ్ మద్దుల మురళి, పీటీ పీరియా ప్రతాప్ దాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ ఇన్‌చార్జిగా ప్రశాంత్



నిజామాబాద్ నాగారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ టోర్నమెంట్‌లో భాగంగా నిజామాబాద్ జిల్లా కబడ్డీ కోచ్, జాతీయస్థాయి క్రీడాకారుడు మీసాల ప్రశాంత్ కబడ్డీ టోర్నమెంట్‌కు ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ నెల 27నుంచి 30వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల, మహిళల కబడ్డీ టోర్నమెంట్‌కు ఆయన ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. జిల్లా కోచ్‌కు ఈ అవకాశం రావడంపై జిల్లా క్రీడాకారులు, క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు ఆయనకు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

దుబాయ్‌లో గుండెపోటుతో మాక్లూర్ వాసి మృతి



ఫారత్ (ఫైల్)

మాక్లూర్: బతుకుదెరువు కోసం మండల కేంద్రం నుంచి దుబాయ్ వెళ్లిన ఫారత్ (40) శనివారం గుండెపోటు వచ్చి మృతిచెందినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఫారత్ 15 రోజుల క్రితమే దుబాయ్ వెళ్లాడని, ఇంతలోనే అతడు గుండెపోటుతో మృతి చెందాడన్న విషయాన్ని తట్టుకోలేకపోతున్నామని కుటుంబ సభ్యులు ఆదివారం విలపిస్తూ చెప్పారు. ఆయనకు భార్య, పాప ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా రప్పించాలని అధికారులు, నాయకులను కోరుతున్నారు.

టిప్పర్ పట్టివేత



రెంజల్(బోధన్): మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను శనివారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. నీలా చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా టిప్పర్ రావడంతో నిలిపివేసి ధ్రువపత్రాలను పరిశీలించినట్లు చెప్పారు. ఇసుకకు సంబంధించి అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు అప్పగించినట్లు వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12మందిపై కేసులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీలు చేశారు. అలాగే వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా 12మంది మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. దీంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మద్యం తాగి ఎవరైనా వాహనం నడిపితే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ఎస్సై షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామంలో కుక్కల దాడిలో లేగదూడ మృతిచెందినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గ్రామంలోని కిరణ్‌కు చెందిన లేగదూడను శనివారం రాత్రి పాకలో వదిలేశారు. రాత్రిపూట కుక్కలు లేగదూడను వెంబడించి తీవ్రంగా గాయపరిచాయి. ఉదయం కిరణ్ పాక దగ్గరకు వెళ్లి చూడగా దూడను కుక్కలు చుట్టుముట్టాయి. దాడిలో లేగదూడ అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

మల్కాపూర్‌లో కొండచిలువ కలకలం



బీబీపేట: మండలంలోని మల్కాపూర్ గ్రామంలోగల ఓ పొలంలోని బావి వద్ద కొండ చిలువ ఆదివారం కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన గోవిందరాజు ఎప్పటిలాగే వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్లగా కొండచిలువ కంటపడింది. వెంటనే అప్రమత్తమై చుట్టుపక్కల రైతులకు సమాచారం అందించగా వారు వచ్చి కొండచిలువను చంపేశారు. కొండచిలువ సుమారు రెండు మీటర్ల పొడవుతో 5 కిలోల బరువు ఉందని రైతు తెలిపారు. గతంలో సైతం ఇదే శివారులోని పలువురి పొలాల్లో కూడా కొండ చిలువలు కనిపించడంతో స్థానికులు చంపేశారు. ప్రతిసారి ఇలా ప్రత్యక్షం అవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవోదయలో సమావేశమైన 1993-94 ఆరవ తరగతి విద్యార్థులు

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం 1993, 94 ఆరో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆనాటి మిత్రులందరూ చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలు, ప్రస్తుత వ్యాపకాలు, ఉద్యోగం, స్థిరనివాసాలపై ఒకరినొకరు చెప్పుకుంటూ, పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆటపాటలు, నృత్యాలతో విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థులు వినయ్‌కుమార్, అనిల్‌కుమార్, రేణుకా కుమారి, నాగవేందర్, విజయ్‌రాజ్, నవీన్‌కుమార్, రాజబాబు, విక్రమ్, నరహరి, గంగమోహన్, శోభ, రేఖ, సరిత, అనిత ఉన్నారు.

దేవునిపల్లిలో..



విద్యార్థుల నృత్య ప్రదర్శన

కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004–05 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇరువై యేళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆనాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించి, జ్ఞాపికలను అందజేసి శాలువలతో సన్మానించారు. ఉపాధ్యాయులు సత్యం, ఉపేందర్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దేవునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ 2004-05 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు